సాక్షి కర్నూలు

ఆదివారం । 16 । మార్చి । 2025



రూ.5 లక్షల విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలోని నిత్య అన్నదాన పథకానికి శనివారం విజయవాడకు చెందిన పీఆర్ఎల్ ప్రసాద్ రూ.5 లక్షల విరాళాన్ని దేవస్థాన ఏఈఓ జి.స్వాములుకు అందజేశారు.



వైభవోపేతం.. గరుడోత్సవం

ఎగువ అహోబిలంలో వెలసిన ఉగ్ర నరసింహ స్వామి గరుడోత్సవం శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు అంగరంగ వైభవంగా సాగింది.

ఉష్ణోగ్రతలు


కనిష్టం	24.3
గరిష్టం	40.8

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:33	ఉ॥ 5:03
ఆదోని	సా॥ 6:32	ఉ॥ 5:03
నంద్యాల	సా॥ 6:30	ఉ॥ 5:03
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 4:58
బనగానపల్లె	సా॥ 6:32	ఉ॥ 5:01

హదీస్ వెలుగు :
ఇఫ్తార్ సమయంలో "యా వాసియల్ ఫజ్లి యుగ్ ఫిర్లి, అస్తగ్ ఫిరుల్లాహ్" అధికంగా జపించండి. దీనివల్ల మీ పాపాలను అల్లాహ్ దహించివేస్తారు. – పవిత్ర ఖురాన్

పుట్టుకతో తోడై.. జీవితం సూదిపోటై!



షుగర్ వ్యాధి బారిన పడకుండా ఒక్కొక్కరు ఒక్కో ఆరోగ్య సూత్రాన్ని పాటిస్తుంటారు. ఒకరు రైస్ తినకూడదంటారు.. ఇంకొకరు నడక మంచిదంటారు.. ఒక వయస్సుకు వచ్చిన తర్వాత వ్యాధి బారిన పడటం ఒక ఎత్తయితే, రాకుండా జాగ్రత్త పడటం ఇంకొక ఎత్తు. మరి పుట్టుకతోనే ఈ వ్యాధి తోడుగా వస్తే.. ఆ పిల్లల జీవితం నరక ప్రాయం. ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకుంటే తప్ప బతకలేని పరిస్థితి. తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. అసలు ఎందుకు ఈ పరిస్థితి? వీళ్లు చేసిన పాపం ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానమే ఈ కథనం.

➤ కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీకి చెందిన యువకునికి పుట్టుకతోనే షుగర్ వ్యాధి వచ్చింది. వైద్యులు పరిశీలించి టైప్–1 దయాబెటిస్‌గా నిర్ధారించారు. అప్పటి నుంచి ఇన్సులిన్‌ను ఇంజెక్షన్ రూపంలో అందిస్తున్నారు. ప్రస్తుతం ఇతని వయస్సు 30 ఏళ్లు. రోజూ ఇంజెక్షన్ వేయించుకోవాలంటే బాధగా ఉంటోందని, కానీ బతకాలంటే తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. స్వీట్లు అంటే ఇష్టమని, కానీ తింటే పరిస్థితి దారుణంగా ఉంటుందని వాపోతున్నాడు.

➤ పగిడ్యాల మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామానికి చెందిన మల్లయ్య, మానస దంపతులు వ్యవసాయ కూలీలు. వీరికి ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు వెంకట ఉమామహేష్, రెండవ కుమారుడు లిఖిత్. 9 నెలల వయస్సు కలిగిన లిఖిత్‌కు పుట్టుకతోనే చక్కెర వ్యాధి తోడుగా వచ్చింది. తరచూ అపస్మారక స్థితికి చేరుకోవడం గమనించి కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రిలో సుమారు రూ.3లక్షలకు పైగా ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. షుగర్ లెవెల్స్ గుర్తించేందుకు మిషన్ తెచ్చుకుని వారానికోసారి ఇన్సులిన్ ఇంజెక్షన్ వేయించాల్సిన పరిస్థితి. నెలకు సుమారు రూ.5వేల దాకా ఖర్చవుతోందని తల్లి దండ్రులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.



కర్నూలు(హాస్పిటల్): పేరులో తియ్యదనం దాచుకున్న మహమ్మారి మధుమేహం. ఇది పెద్దలనే కాదు.. చిన్నారులనూ వదలని పరిస్థితి. పుట్టుకతోనే తోడుగా వచ్చి జీవించినంత కాలం వేధిస్తోంది. అందరిలా జీవించాలంటే రోజూ సూదిపోటుతో ఇన్సులిన్ మందు వేసుకోవడం తప్పనిసరి. అల్లారుముద్దుగా పెంచుకున్న కన్నబిడ్డలను తల్లిదండ్రులే స్వయంగా ఇంజెక్షన్ ద్వారా ఇన్సులిన్ ఇవ్వడం వారికీ నరకంతో సమానం. ఇలాంటి బాధితుల సంఖ్య సమాజంలో రోజురోజుకూ పెరుగుతోంది. శరీరంలోని క్లోమగ్రంధిలో ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. అయితే కొన్ని కారణాల వల్ల ఈ గ్రంధిలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే కణాలను(బీటా కణాలు) వ్యక్తుల రోగనిరోధక వ్యవస్థ నాశనం చేస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. దీన్ని టైప్–1 మధుమేహం(డయాబెటిస్) అంటారు. సాధారణంగా పిల్లలు, యువకుల్లో ఈ పరిస్థితి కనిపిస్తుంది. అయితే కొన్నిసార్లు బీటా కణాలను రోగనిరోధక వ్యవస్థ నిర్వీర్యం చేయడం కాకుండా క్లోమగ్రంధికి ఏదైనా వ్యాధి సోకినప్పుడు లేదా గాయం అయినప్పుడు బీటా కణాలు నిర్వీర్యం అవుతాయి. దీనిబారిన పడిన వారికి క్రమం తప్పకుండా ఇన్సులిన్‌ను ఇంజెక్షన్ చేయాల్సి ఉంటుంది. ఇది కొంత మందికి జన్యుపరంగా కూడా రావచ్చు. మరికొంత మందికి పలు రకాల వైరల్ వ్యాధులు, ఇతర ప్రమాదకర అనారోగ్యాల కారణంగా కూడా ఈ పరిస్థితి ఎదురవ్వొచ్చు. అంతేకానీ ఆహారం, జీవనశైలి అలవాట్లు టైప్–1 దయాబెటిస్‌కు కారణం కావు.

చిన్నారుల్లో 'తియ్యని' బాధ

- పుట్టుకతోనే తోడవుతున్న షుగర్ వ్యాధి
- కోవిడ్ తర్వాత పెరిగిన టైప్–1 రోగులు
- వంశపారంపర్యం, పలు రకాల ఇన్ఫెక్షన్లు కారణం
- ఇన్సులిన్ తీసుకోవడం తప్పనిసరి
- పెరిగిన చికిత్స వ్యయంతో సతమతం

లక్షణాలు

- టైప్–1 డయాబెటిస్ లక్షణాలు బయటపడటానికి కొన్ని నెలలు లేదా సంవత్సరాలు పట్టవచ్చు.
- విపరీతమైన దాహం, తిన్న తర్వాత కూడా బాగా ఆకలి వేయడం, నోరు తడి ఆరిపోవడం.
- కడుపునొప్పి, వాంతులు, ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లడం.
- ఊహించని విధంగా బరువు తగ్గిపోవడం, అలసట, కంటిచూపు తగ్గిపోవడం.
- శ్వాస తీసుకోవడానికి ఎక్కువ కష్టపడటం, తరచుగా చర్మ, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు.
- మూడ్ మారిపోవడం, నిద్రలో మూత్రవిసర్జన చేయడం.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 50లక్షల వరకు జనాభా ఉంటుంది. ఇందులో 15 నుంచి 20 శాతం వరకు మధుమేహ బాధితులు. వీరిలో టైప్–2 మధుమేహ బాధితులు 90 శాతం కాగా.. టైప్–1 బాధితులు 10 శాతం పైనే. ఈ లెక్కన 7.50లక్షల నుంచి 10లక్షల వరకు మధుమేహ బాధితులు ఉండగా.. 75వేల నుంచి లక్ష దాకా చిన్నారులు ఉంటున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో అరకొర ఇన్సులిన్

ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్సతో పాటు ఇన్సులిన్‌ను ఉచితంగా అందించాల్సి ఉంది. అయితే గత 10 నెలలుగా వీరికి అరకొరగా ఇన్సులిన్ ఇస్తున్నారు. కేవలం కర్నూలు, నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో మాత్రమే అధికారులు స్థానికంగా కొనుగోలు చేసి ఇన్సులిన్‌ను కొద్దిమొత్తంలో అందజేస్తున్నారు. ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో ఇన్సులిన్ అందుబాటులో ఉండటం లేదు. దీంతో చాలా మంది మెడికల్ షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో చిన్నారికి వ్యాధి తీవ్రతను బట్టి నెలకు రెండు నుంచి నాలుగు ఇన్సులిన్ ఇంజెక్షన్లు అవసరం.

కోవిడ్ తర్వాత పెరిగిన కేసులు



కోవిడ్–19 అనంతరం టైప్–1 డయాబెటిస్ రోగుల సంఖ్య పెరిగింది. గతంలో డయాబెటిస్ రోగులు 5 శాతం ఉండగా ఇప్పుడు 10శాతానికి చేరుకుంది. కోవిడ్ వైరస్ నేరుగా బీటా కణాలపై దాడి చేయడమే ఇందుకు కారణం. ఈ కారణంగా కోవిడ్‌కు గురైన వారికి జన్మించే పిల్లల్లో టైప్–1 డయాబెటీస్ ఎక్కువగా కనిపిస్తోంది.
– డాక్టర్ పి.శ్రీనివాసులు, ఎండోక్రైనాలజీ హెచ్‌వోడి, జీజీహెచ్, కర్నూలు

ఇన్సులిన్‌తో మాత్రమే చికిత్స



చిన్నపిల్లల్లో వచ్చే టైప్–1 డయాబెటిస్‌కు ఇన్సులిన్‌తో మాత్రమే చికిత్స అందుబాటులో ఉంది. ఆయాసం, కడుపునొప్పి, వాంతులు లక్షణాలతో చిన్నపిల్లలను ఆసుపత్రికి తీసుకొస్తారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించి డయాబెటిస్ నిర్ధారణ అయ్యాక చికిత్స ప్రారంభిస్తాం. ఈ పిల్లలకు ఇన్సులిన్‌తో పాటు ఆహార నియమావళి తప్పనిసరి.
– డాక్టర్ ఎం.మల్లికార్జున, అసోసియేట్ ప్రొఫెసర్, పీడియాట్రిక్స్, జీజీహెచ్, కర్నూలు

పెరుగుతున్న చికిత్స వ్యయం

మెడికల్‌షాపుల్లో ఒక్కో ఇన్సులిన్ ఖరీదు రూ.180 వరకు ఉంటోంది. ఈ మేరకు ప్రతి చిన్నారికి నెలకు రూ.600 నుంచి రూ.800 వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రులతో పాటు ప్రైవేటు క్లినిక్‌లు, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యుల వద్ద చికిత్స తీసుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఆధునిక వైద్యవిధానాల మేరకు వారికి నొప్పి తక్కువగా ఉండే ఇన్సులిన్ పెన్నుల ద్వారా ఇంజెక్షన్ చేస్తున్నారు. వీటి ఖరీదు సాధారణ ఇన్సులిన్‌తో పోలిస్తే రెట్టింపుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను అందజేయవచ్చన్నారు. సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

చేపల పెంపకంతో స్వయం ఉపాధి



చేపలను పరిశీలిస్తున్న రాంశంకర్‌నాయక్

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం ఉపాధిలో రాణించేందుకు చేపల పెంపకం చక్కటి అవకాశమని మత్స్యశాఖ కమిషనర్ రాంశంకర్‌నాయక్ తెలిపారు. శనివారం ఆయన కర్నూలు, సుంకేసుల డ్యామ్, గాజులదిన్నె ప్రాజెక్టుల్లో పర్యటించారు. కర్నూలు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో 2024–25 సంవత్సరానికి సంబంధించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిని సమీక్షించారు. జిల్లా ప్రగతిని జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల కమిషనర్‌కు వివరించారు. కర్నూలు పాత బస్టాండు సమీపంలోని చేపల మార్కెట్‌ను తనిఖీ చేశారు. బంగారుపేటలోని దేశీయ మత్స్య శిక్షణా కేంద్రం(ఐఎఫ్‌టీసీ)లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేడు మార్కెట్‌లో చేపలకు విశేషమైన డిమాండ్ ఉందని, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద చేపల మార్కెటింగ్‌కు అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పాడుపు మహిళల అనుసంధానంతో చేపల ఉత్పత్తిని పెంచడం, వినియోగాన్ని విస్తృతం చేయనున్నట్లుగా పేర్కొన్నారు.

బోధనలో ఇంటి వాతావరణం కల్పించాలి

కల్లూరు: పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని విద్యార్థులకు ఇంటి వాతావరణంలో ఉన్నట్లుగా బోధన చేయాలని డీఈఓ శామ్యూల్‌పాల్ సూచించారు. శనివారం కల్లూరు మండలం పెద్దపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో సమగ్ర శిక్ష ద్వారా కేజీబీవీ ప్రిన్సిపాళ్లకు, ఎస్ఎంలు, పీఈటీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడి, మానసిక ఆందోళనకు గురి కాకుండా ఉపాధ్యాయులు సూచనలివ్వాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర ఏపీసీ శ్రీనివాసులు, జీసీడీఓ స్నేహలత పాల్గొన్నారు.

రైతుల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

పత్తికొండ రూరల్: టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్న రైతుల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య ఆరోపించారు. శనివారం స్థానిక చదువుల రామయ్య భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను ఇక్కడి పాలకుల ఉదాసీన వైఖరి వల్ల టమాటా ప్రాసెసింగ్ యూనిట్‌గా మార్చారన్నారు. ప్రాసెసింగ్ యూనిట్‌ను వ్యాపార దృక్పథంతో గాకుండా రైతుల ప్రయోజనార్థం విస్తృతం చేసి, అందులో రైతులను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి సురేంద్రకుమార్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఉమాపతి, కారన్న, నెట్టికంటయ్య పాల్గొన్నారు.

క 'న్నీటి' వ్యథ!

- తాగునీటి తిప్పలు షురూ!
- పక్కనే ఎల్ఎల్‌సీ ఉన్నా తప్పని ఇబ్బందులు
- ఉమ్మడి జిల్లాలో 171 గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంటుందని అంచనా
- రూ.10 కోట్ల ప్రతిపాదనలకు కనిపించని ఫలితం
- ప్రశ్నార్థకంగా సాగునీటి ప్రాజెక్టులు
- కుదేలవుతున్న రైతులు
- మద్దతు ధర ప్రకటించినా మార్గదర్శకాలేవి ?
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



జిల్లాలోని ఆస్పరి మండలం జోలాపురం గ్రామంలో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడికి నిదర్శనం ఈ చిత్రం. ఏడు వేల జనాభా ఉన్న ఈ గ్రామానికి హాలహర్వి మండలంలోని బాపురం రిజర్వాయర్ నుంచి 15 రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో ఉదయం నిద్రలేచినప్పటి నుంచి మోటారు సైకిళ్లు వేసుకొని సమీపంలోని వక్కిరేణి వద్దకు వెళ్లి బిందెలతో నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాగే ఈ మండలంలోని చిన్నహోతూరు, తొగలగల్లు, చిగిలి గ్రామాల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది.

కర్నూలు(అర్బన్): వేసవి ప్రారంభంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో అనేక గ్రామాలు తాగునీటి ఇబ్బందులను చవిచూస్తున్నాయి. ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు ఇంకిపోవడంతో బోర్లలో నీరు రాకపోవడం వల్ల గ్రామాల సమీపంలోని వ్యవసాయ బావులు, బోర్లపై ఆధారపడి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ప్రధానంగా కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి చెందిన అనేక గ్రామాల్లో ప్రస్తుత వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. పలు గ్రామాల్లో సమీపంలోని ఎస్ఎస్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా, ప్రజల అవసరాలకు ఆ నీరు సరిపోవడం లేదు. కొంతమేర ముందస్తు చర్యలు చేపట్టినా, ఆయా ఎస్ఎస్ ట్యాంకుల్లోని నీటి నిల్వలు రోజు రోజుకు తగ్గిపోతుండడంతో భవిష్యత్తును తలచుకొని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో ప్రస్తుత వేసవిలో 76 గ్రామాలు తీవ్ర మంచినీటి ఎద్దడికి గురయ్యే ప్రమాదం ఉందని, ఆయా గ్రామాల్లో వేసవి దాహార్తిని ఎదుర్కొనేందుకు రూ.6.91 కోట్లు వ్యయం కానుందని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. అలాగే నంద్యాల జిల్లాలో 95 గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.3.66 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలను పంపారు. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పటికే అనేక గ్రామాల్లో ట్రాన్స్‌పోర్టేషన్, హైరింగ్ ద్వారా నీటిని అందించాల్సి ఉంది.

ప్రశ్నార్థకంగా సాగునీటి ప్రాజెక్టులు ...

కరువుకు ఆలవాలమైన కర్నూలు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం నేటికి దృష్టి సారించలేదు. రూ.4,530 కోట్లతో డీపీఆర్ సిద్ధమైన గుండ్రేవుల ప్రాజెక్టుకు కమిషన్ కాలేదు. అలాగే రూ.1,945 కోట్లతో చేపట్టనున్న వేదావతికి రూ.100 కోట్ల పనులను మాత్రమే చేపట్టారు. నిధుల కేటాయింపు లేకపోవడంతో రూ.1,983 కోట్లతో ఆర్‌డీఎస్ కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉంది. ఇక కర్నూలు నగర నడిబొడ్డున ప్రవహిస్తున్న కేసీ కెనాల్, హంద్రీపై అధికారులు దృష్టి సారించకపోవడం వల్ల కేసీ, హంద్రీ మురికి కూపాలుగా మారిపోయాయి. ఎక్కడి చెత్తనంతా తీసుకువచ్చి కేసీ, హంద్రీలో వేస్తున్నా, ఎవరు పట్టించుకున్న పాపాన పోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. హంద్రీ నీవా ద్వారా 77 ట్యాంకులను నింపడంలో భాగంగా జిల్లాలోని 39 చెరువులకు గాను ఇప్పటి వరకు 33 చెరువులకు నీరు నింపినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఇందులో 23 చెరువులను పూర్తిగాను, మిగిలిన 10 చెరువులను పాక్షికంగా నింపారు.

గిట్టుబాటు ధర లేక..

కూటమి ప్రభుత్వంలో మిర్చి పంటకు సరైన ధర లభించక పోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక కష్టాలకు గురవుతున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు 1.50 లక్షల ఎకరాల్లో మిర్చిని సాగు చేశారు. గత ఏడాది ఒక క్వింటాల్‌కు రూ.23 వేల వరకు ధర పలికింది. అయితే ప్రస్తుతం ఒక క్వింటా రూ11 వేలకు మించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మిర్చి రైతును ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక క్వింటా మిర్చికి రూ.11,781 లు మద్దతు ధర ప్రకటించినా, నేటికి ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల కాలేదు.

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



ఈ నెల 16వ తేదీన (ఆదివారం) జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన ఉదయం 9.30 గంటలకు స్థానిక మినీ సమావేశ భవనంలో 1వ స్థాయి సంఘ సమావేశాలను నిర్వహించనున్నామన్నారు. అనంతరం 10.30 గంటలకు స్థానిక జెడ్పీ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా అజెండాలో పొందుపరిచిన గ్రామీణ నీటి సరఫరా – పారిశుద్ధ్యం, వ్యవసాయం, జలవనరుల శాఖలకు సంబంధించి సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

- జిల్లా ఇన్‌చార్జ్ ఆఫీసర్ సెక్రటరీ కాంతిలాల్ దండే



మాట్లాడుతున్న కాంతిలాల్ దండే

కర్నూలు(సెంట్రల్): జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిద్దామని జిల్లా ఇన్‌చార్జ్ ఆఫీసర్.. రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ దండే సూచించారు. సమర్థవంతమైన పరిపాలనను అందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులను జిల్లా ఇన్‌చార్జ్ ఆఫీసర్లుగా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ స్థాయి ఐఏఎస్ అధికారులను జోనల్ ఇన్‌చార్జ్ ఆఫీసర్లుగా నియమించింది. అందులో భాగంగా కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ అధికారిగా నియమితులైన రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే శనివారం కర్నూలు వచ్చారు. ఆయన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పథకాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పేదరిక నిర్మూలన, ఎంఎస్ఎంఈల ఏర్పాటు, విద్య, వైద్య రంగాల అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. అనంతరం జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాపై కలెక్టర్.. ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, సీపీఓ హిమ ప్రభాకరరాజు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ అధికారులతో..

జిల్లా ఇన్‌చార్జ్ ఆఫీసర్ కాంతిలాల్ దండే ఆర్అండ్‌బీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లాలో ముఖ్యమైన రోడ్ల నిర్మాణాలు అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని, మిషన్ పాట్ హోల్ కింద పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్ఈ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. వాహనాల రిజిస్ట్రేషన్లను పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్, రిజిస్ట్రేషన్ అంశాలపై నివేదిక ఇవ్వాలని ఆయన డీటీసీ శాంతికుమారికి సూచించారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జేసీ డాక్టర్ బి.నవ్య



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఆది, సోమవారాల్లో జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జేసీ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆమె ఎఫ్ఆర్ఓ, ఎన్టీఆర్ వైద్య యూనివర్సిటీ జూనియర్ అసిస్టెంట్ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్నాహ్నం 12 గంటలకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షా సమయం ఉంటుందన్నారు. గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, జిల్లా వైద్య అధికారి శాంతికళ, ఏపీపీఎస్సీ అధికారివెంకట్రావు, ఆర్‌వీ రమణ పాల్గొన్నారు.

ఎస్టేటు అధికారుల బదిలీ

కర్నూలు(అగ్రికల్చర్): రైతుబజార్ల ఎస్టేటు అధికారుల బదిలీలు జరిగాయి. కీలకమైన సి.క్యాంపు రైతుబజారు ఎస్టేటు అధికారిగా కళ్యాణి నియమితులయ్యారు. అమీన్ అబ్బాస్‌నగర్ రైతుబజారు ఎస్టేటు అధికారిగా పనిచేస్తున్న కళ్యాణిని సి.క్యాంపునకు బదిలీ చేస్తూ రాష్ట్ర రైతుబజార్ల సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సి.క్యాంపులో పనిచేస్తున్న హరీష్‌కుమార్ ఆదోని రైతుబజారుకు బదిలీ అయ్యారు. కొత్తపేట రైతుబజారు ఎస్టేటు అధికారిగా పనిచేస్తున్న జయమ్మను అమీన్ అబ్బాస్‌నగర్ రైతుబజారుకు బదిలీ చేశారు. ఆదోని రైతు బజారులో ఎస్టేటు అధికారిగా పని చేస్తున్న అక్తర్‌షరీఫ్‌ను కొత్తపేట రైతుబజారుకు బదిలీ చేశారు. సి.క్యాంపు రైతు బజారులో నిజమైన రైతులకు స్థానం కల్పిస్తామని ఎస్టేటు అధికారి కళ్యాణి వెల్లడించారు.

శ్రీగిరి భద్రతపై సమీక్ష

సాక్షి ఎఫెక్ట్

శ్రీశైలంటెంపుల్: 'సాక్షి' దిన పత్రికలో శనివారం 'భగవంతుడా.. ఇదేమి భద్రతా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు స్పందించారు. దేవస్థాన భద్రతా విషయాలపై సమగ్ర పరిశీలన చేయాలని దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహారెడ్డిని ఈఓ ఆదేశించారు. ఈ మేరకు ఆయన క్యూలైన్ల వద్దకు చేరుకుని, క్యూలైన్ ఏఈఓ, పర్యవేక్షకులు, భద్రతా పరికరాల పర్యవేక్షణ చేపట్టే ఇంజినీర్లు, సెక్యూరిటీ సూపర్ వైజర్లతో సమీక్షించారు. మెటల్ డోర్ ఫ్రేమ్ డిటెక్టర్లు కొన్ని పనిచేయడం లేదని, హ్యాండ్ డిటెక్టర్లు ఉన్నా వినియోగించేందుకు సిబ్బంది తక్కువ ఉన్నారని గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రతా ఏర్పాట్లు మరింత మెరుగుపరుస్తామన్నారు. లగేజ్ స్కానర్లు సైతం వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. సోమవారం ఈఓ స్వయంగా క్షేత్ర భద్రతపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లోపాలను క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటారన్నారు.

ముగిసిన ఇంటర్మీడియెట్ పరీక్షలు

కర్నూలు (సిటీ): ఇంటర్మీడియెట్ ప్రధాన పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈనెల 1న 69 కేంద్రాల్లో పరీక్షలు మొదలయ్యాయి. 13న ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ముగియగా, సెకండ్ ఇయర్ ప్రధాన పరీక్ష శనివారంతో ముగిసింది. చివరి రోజు 19,596 మంది విద్యార్థులకు గాను 19,182 మంది హాజరయ్యారు. 414 మంది గైర్హాజరయ్యారు. ప్రధాన పరీక్షలు ముగియడంతో ఆయా కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు స్వగ్రామాలకు బయలుదేరి వెళ్లారు. విద్యార్థులతో ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసిపోయింది.

క్లుప్తంగా

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


మృతిచెందిన అమూల్యరాజు (ఫైల్)

పాములపాడు: వేంపెంట గ్రామ పంచాయతీ మజారా గుండాలనట్టు గ్రామానికి చెందిన అమూల్యరాజు(13) అనే విద్యార్థి ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన ఆవుల ఆనందరాజు, కల్యాణి దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు అమూల్యరాజు బానకచెర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన విద్యార్థి గ్రామ సమీపంలోని తెలుగుగంగ కాల్వకు నలుగురు స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లాడు. సరదాగా ఈత కొడుతుండగా అమూల్యరాజు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు విషయాన్ని పెద్దలకు తెలియజేయగా హుటాహుటిన అక్కడికి చేరుకుని గాలింపు చేపట్టారు. చివర విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

అనుమానంతో భార్యను కడతేర్చాడు


మృతి చెందిన నజీమూన్ (ఫైల్)

నందికొట్కూరు: ఓ వ్యక్తి అనుమానంతో భార్యను అంతమొందించాడు. దారుణంగా ఈలపీటతో దాడి చేసి చంపేశాడు. నందికొట్కూరు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని బీఎస్ఎస్ ఆర్ నగర్‌లో నివాసముంటున్న మొల్ల దర్వేసి మియా, రఫియాబీ దంపతుల కుమారుడు మొల్ల అబ్దుల్లాతో బండి ఆత్మకూరుకు చెందిన పటాన్ అలీబాషా, ఆశాబీ దంపతుల పెద్ద కుమార్తె నజీమూన్(21)కు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాదిన్నర కుమార్తె ఉంది. కొన్నాళ్లుగా అబ్దుల్లా అనుమానంతో భార్యను తరచూ వేధించాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం భార్య నజీమూన్‌తో గొడవపడి ఈల కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడటంతో కుటుంబీకులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి అలీబాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయులు నాయక్ శనివారం నందికొట్కూరు చేరుకుని విచారణ చేపట్టారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న రిజిస్ట్రార్, విద్యార్థులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. వర్సిటీ సమీపంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్‌నాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు సేవాగుణం అలవడుతుందన్నారు.

మహిళ ఆత్మహత్య

తుగ్గలి: రామాపురం గ్రామానిక చెందిన రాజేశ్వరి (25) ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు రెండున్నరేళ్ల క్రితం తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా రెడ్డిపట్టి గ్రామానికి బతుకుదెరువు నిమిత్తం వెళ్లాడు. అక్కడ పరిచయమైన రాజేశ్వరిని వివాహం చేసుకున్నారు. ఇద్దరికీ ఇదివరకే వివాహాలయ్యాయి. అయితే శుక్రవారం రాత్రి ఇంట్లో భర్త లేని సమయంలో రాజేశ్వరి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్ ఘటనా స్థలానికి వెళ్లి ఆత్మహత్యపై ఆరా తీశారు. మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందించామని ఎస్ఐ తెలిపారు.

మటన్.. నాణ్యత మటాష్

- కొందరు వ్యాపారుల ఇష్టారాజ్యం
- అనారోగ్యంతో ఉన్న, మృతి చెందిన జీవాల వధ
- విక్రయాల్లో అడుగడుగునా దగానే!
- ధరను పెంచి అడ్డగోలుగా అమ్మకాలు
- చర్యలు తీసుకోవడంలో అధికారుల విఫలం

పెరిగిన ధరలు..

బర్డ్‌ఫ్లూ వెలుగు చూసిన తర్వాత కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, ఆత్మకూరు వంటి ప్రాంతాల్లో మటన్ కిలో ధర రూ.900 పెంచేశారు. కర్నూలు, నంద్యాల, ఆదోని ప్రాంతాల్లో కిలో రూ.1000 వరకు అమ్ముతున్నారు. ఇంత ధర పెట్టినప్పటికీ మాంసంలో నాణ్యత ఉంటుందా అంటే అదీ లేదు. పరీక్షలు లేవు... వధించింది పొట్టేలా..గొర్రెనా.. మేకనా.. అనేది తెలియదు. కొన్ని చోట్ల అనార్యాగంతో అపుడో, ఇపుడో చనిపోయే వాటిని కూడా మాంసానికి వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా కారణాలతో మరణించిన జీవాలను కూడా కొందరు వ్యాపారులు మాంసానికి వినియోగిస్తున్నట్లు సమాచారం.



కర్నూలు(అగ్రికల్చర్): మాంసం లేనిదే నాన్ వెజ్ ప్రియులకు ముద్ద దిగదు. కొందరు ఆదివారం కోసం ఎదురు చూస్తుంటారు. మరి కొందరు వారంలో రెండు, మూడు రోజులు మాంసాహారమే తీసుకుంటారు. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో ఇటీవల మటన్ తినేవారు ఎక్కువయ్యారు. అయితే అడిగిందే ఇస్తున్నారా.. ఆరోగ్యంగా ఉన్న గొర్రెలు, మేకలు, పొట్టేళ్లను కోస్తున్నారా.. ఇలా ఎన్నో ప్రశ్నలు వస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చాలా చోట్ల నాణ్యతలేని మటన్‌ను ధర పెంచి అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నిబంధనలు బేఖాతర్..

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో దేవరలు జరుగుతుండటంతో మటన్‌కు డిమాండ్ పెరిగింది. ఒక మోస్తరు గ్రామంలో దేవర జరుగుతుందంటే 2,000, పెద్ద గ్రామంలో అయితే 4,000 వరకు జీవాలు కట్ అవుతాయి. దీనినే అవకాశంగా తీసుకొని అనారోగ్యానికి గురైన వాటిని కూడా వ్యాపారులు మాంసానికి వినియోగిస్తున్నారు. ధర పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మటన్ కొనలేకపోతున్నారు. నిబంధనలు పాటించకుండా కొందరు మాంసం వ్యాపారులు మోసం చేస్తున్నారు. మాంసానికి వినియోగించే జీవాల ఆరోగ్యాన్ని నిబంధనల ప్రకారం శానిటరీ ఇన్‌స్పెక్టర్, పశు సంవర్థక శాఖ వైద్యుడు పరిశీలించాలి. వీరి పర్యవేక్షణలో వధించిన మాంసంపై ముద్ర (రౌండ్ సీల్) వేసినది మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించే విధంగా నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు చొరువ తీసుకోవాల్సి ఉంది. అయితే ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధికారులు తనిఖీలు చాలా తక్కువ చేస్తున్నారు. దీంతో సగానికిపైగా వ్యాపారులు ఇళ్లు, దుకాణాల వద్దనే గొర్రెలు, మేకలు, పొట్టేళ్లను వధిస్తున్నారు. అంతేకాకుండా రోగాల బారినపడినవి, వయసు పైబడిన వాటిని కూడా వధించి విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలున్నా యి. ముఖ్య పట్టణాల్లో లైసెన్సు కలిగిన దుకాణాల్లో కాకుండా ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైన, మురికి కాలువల పక్కన అపరిశుభ్ర వాతావరణంలోనే అమ్మకాలు సాగిస్తున్నారు. ధరల వివరాల పట్టిక కనిపించకపోయినా ఎవరూ అడగడం లేదు.

ఇలా చేయాలి...

- మురుగు కాలువల సమీపంలో, అపరిశుభ్ర వాతావరణం ఉన్న దుకాణాల్లో మాంసం తీసుకోవద్దు.
- మాంసానికి వినియోగిస్తున్న జీవాలు ఆరోగ్యంగా ఉంటున్నాయా... అనే దానిని పట్టించుకోవాలి.
- అధికారుల ముద్ర (రౌండ్ సీల్) వేసిన మాంసం మాత్రమే విక్రయించాలి. ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన దానిని అస్సలు కొనొద్దు.
- తూకం వేసేటప్పుడు పరిశీలించాలి. అనుమానం వస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలి.

వినియోగం ఇలా..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 80 శాతం అంటే 12 లక్షల కుటుంబాలు మాంసాహారాన్ని ఇష్టంగా తీసుకుంటాయి. ఇందులో 60 శాతం కుటుంబాలు (7.20 లక్షలు) చికెన్‌తో సరిపుచ్చుకుంటాయి. మిగిలిన 4.80 లక్షల కుటుంబాలు మటన్ తీసుకుంటాయి. వారం విడిచి వారం కిలో ప్రకారం వినియోగించినా... 24 వేల టన్నుల వరకు మాంసం అవసరమవుతోంది. బర్డ్‌ఫ్లూ తర్వాత హోటళ్లలో చికెన్ వినియోగం కొంతవరకు తగ్గింది. మటన్‌పై వినియోగదారులు దృష్టి పెట్టారు. కొన్ని హోటళ్లలో వినియోగించే మటన్ నాణ్యత కూడా ప్రశ్నార్థకంగానే ఉంది.

విక్రయం.. ఇష్టానుసారం

కర్నూలు నగరపాలక సంస్థకు సంబంధించి గతంలో పాతబస్తీలో జంతువధశాల ఉండేది. చుట్టుపక్కల ఉన్న మాంసం వ్యాపారులు అక్కడి వెళ్లి పశువైద్యుడి పర్యవేక్షణలో పొట్టేళ్ల, గొర్రెలు, మేకలను కోసేవారు. అయితే జంతువధశాల మూడేళ్ల క్రితం మూత పడింది. దీంతో వ్యాపారాలు ఆదివారం ఇష్టారాజ్యంగా రోడ్లపైనే మటన్ అమ్ముతున్నారు.

ఆదేశాలు ఇస్తాం

మటన్‌లో నాణ్యత లేదనే విషయం నా దృష్టికి రాలేదు. వ్యాపారులు పరిశుభ్రత పాటించడం లేదనే ఫిర్యాదుల అందలేదు. ఈ విషయాలపై సంబంధిత అధికారులతో చర్చిస్తా. ఫుడ్‌సేఫ్టీ, మున్సిపల్ కమిషనర్లకు తగిన ఆదేశాలు ఇస్తాం.

–బి.నవ్య, జేసీ, జాయింట్ కలెక్టర్, కర్నూలు

వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి అమానుషం


చికిత్స పొందుతున్న బాధితుడు లోకేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గోస్పాడు: కంపమల్ల గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి అమానుషమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడి నంద్యాల ఉదయానంద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కంపమల్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత లోకేశ్వరరెడ్డిని శనివారం కాటసాని పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనంతరం కాటసాని విలేకరులతో మాట్లాడుతూ లోకేశ్వరరెడ్డి వారి కుటుంబ సభ్యులపై టీడీపీ నాయకులు దాడి చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. తమ ప్రభుత్వ పాలనలో పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయని, కూటమి ప్రభుత్వం ప్రజల మధ్య చిచ్చుపెడుతుందన్నారు. గ్రామాల్లో సైతం రెడ్‌బుక్ రాజ్యాంగమంటూ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేయిస్తుందన్నారు. ఇలాంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

- ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- మరో ముగ్గురి కోసం గాలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రమోద్

కోవెలకుంట్ల: కంపమల్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత సోముల లోకేశ్వరరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆళ్లగడ్డ డీఎస్పీ కె. ప్రమోద్ నిందితుల వివరాలు వెల్లడించారు. గ్రామంలో లోకేశ్వరరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా, సూర చిన్న సుబ్బారెడ్డి టీడీపీ నాయకుడిగా ఉన్నారు. లోకేశ్వరరెడ్డి 2021 – 24 వరకు గ్రామ సర్పంచ్‌గా కొనసాగారు. గత కొనేళ్ల నుంచి వీరిమధ్య రాజకీయ మనస్పర్థలున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో వీరిపై పోలీసులు కేసులున్నాయి. కేసీ కెనాల్ నీరు గ్రామానికి అందటం లేదన్న విషయంలో చిన్న సుబ్బారెడ్డి వర్గాన్ని రెచ్చగొట్టే విధంగా మాట్లాడినందుకు ఈ దాడి జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ నెల 12వ తేదీ రాత్రి లోకేశ్వరరెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి, తమ్ముడు వెంకటేశ్వరరెడ్డి ఇంట్లో నిద్రిస్తుండగా సూర చిన్న సుబ్బారెడ్డి మరి కొందరు ఇనుపరాడ్లతో అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి వెంకట్రామిరెడ్డిపై దాడి చేశారు. వెంకటేశ్వరరెడ్డి ఇంట్లోగదిలో నిద్రిస్తుండగా రెండు గదుల తలుపులు పగలగొట్టి అతనిపై దాడి చేయగా రక్తగాయాలతో వారి నుంచి తప్పించుకుని పొలాలవైపు పరిగెత్తుకెళ్లాడు. నిందితులు దాడితో ఆగక ఇంట్లో సామాగ్రిని ధ్వంసం చేశారు. అంతలో పొలం నుంచి లోకేశ్వరరెడ్డి ఇంటి దగ్గరకు రావడం గమనించి దాడి చేసేందుకు ప్రయత్నించగా ఆయన బైక్ వదిలేసి పొలాల వైపు పరిగెత్తుకెళ్లాడు. నిందితులు వదలకుండా వెంట పడి ఇనుపరాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ దాడిలో తలకు, కాళ్లు, చేతులకు బలమైన గాయాలై స్పృహ తప్పి పడిపోయాడు. అంతలోనే దాడి సమాచారం అందుకున్న పోలీసులు వాహనం సైరన్‌తో వస్తుండటం గుర్తించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. లోకేశ్వరరెడ్డి సోదరుడు వెంకటేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు తొమ్మిది మందితోపాటు మరికొంత మందిపై హత్యాయత్నంతోపాటు వివిధ సెక్షన్లపై కేసు నమోదు చేశారు. కేసులో నిందితులైన సూర చిన్న సుబ్బారెడ్డి, సోముల లక్ష్మీనారాయణరెడ్డి, సూర సురేష్‌కుమార్ రెడ్డి, సూర రవికుమార్‌రెడ్డి, షేక్ సుభాన్, రామిరెడ్డిగారి వెంకటసుబ్బారెడ్డిని కోవెలకుంట్ల– ఆళ్లగడ్డ ఆర్ అండ్‌బీ రహదారిలో మండలంలోని కంపమల్ల మెట్ట సమీపంలో శనివారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. రాజకీయ కక్షతో దాడి జరిగిందా, వ్యక్తిగత కక్షలతో దాడి చోటు చేసుకుందా అన్న విషయాలు దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో కోవెలకుంట్ల సీఐ హనుమంతు నాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

లీజ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని శ్రీలక్ష్మీ జగన్నాథ గట్టు వద్ద నిర్మించిన ఏపీ టూరిజం బ్లాక్, పార్క్, కెఫిటేరియా, టాయిలెట్ బ్లాక్, సెక్యూరిటీ గార్డ్ రూమ్, ప్రవేశ రుసుం వసూలు చేసుకొనేందుకు జిల్లా పర్యాటక మండలి చైర్మన్ ఆదేశాల మేరకు టెండర్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 21వ తేదీలోగా కలెక్టరేట్‌లోని ఏపీ టూరిజం అథారిటీ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించవచ్చని పేర్కొన్నారు. 10 సంవత్సరాల కాల పరిమితితో లీజ్‌కు ఇవ్వడం జరుగుతుందని, వివరాలకు 63099 42034ను సంప్రదించాలని సూచించారు.


మన్మథుని పెళ్లి ఊరేగింపు..


మహిళా వేషధారణలతో కుంభాలతో ఊరేగింపుగా వెళ్తున్న పురుషులు

అతడు.. ఆమెగా మారి!

- కనుల పండువగా రతీమన్మథుల ఊరేగింపు
- ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు


కలశాలతో మహిళా వేషధారులు

జిల్లాలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాలు ఆదోని మండలం సంతెకూడ్లూరు, హొళగుంద మండల కేంద్రంలో హోలీ సంబరాలు వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న వేడుకల్లో భాగంగా శనివారం రతీమన్మథుల ఊరేగింపు, కామన్న దహనం కనుల పండువగా సాగింది. సంతెకూడ్లూరులో తమ ఇష్ట దైవాలు సంతానం, ఆరోగ్యం, ఉద్యోగం తదితర కోరికలను నెరవేర్చారనే నమ్మకంతో పలువురు వివిధ వేషధారణల్లో మొక్కులు చెల్లించుకున్నారు. మగువల వేషధారణల్లో పురుషులు ఆకట్టుకున్నారు. అందంగా తయారై తలపై బోనాలు, కలశాల ఊరేగింపులో పాల్గొని ఆకర్షణగా నిలిచారు. హొళగుందలో నిర్వహించిన కామన్న శవయాత్ర ఊరేగింపులో పలు హాస్య సన్నివేశాలు కడుపుబ్బా నవ్వించాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని సంబరాలు చేసుకున్నారు.

– ఆదోని రూరల్/హొళగుంద


హొళగుందలో కామన్న శవ యాత్ర సందర్భంగా హాస్య సన్నివేశం


ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

బకాయిలు చెల్లించకుంటే కుళాయి కనెక్షన్ల కట్

- నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ

కర్నూలు (టౌన్): బకాయిలు చెల్లించకుంటే గృహ కుళాయి కనెక్షన్లు తొలగిస్తామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ తెలిపారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కమిషనర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ప్రత్యేక అధికారులతో పన్ను వసూళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పన్ను చెల్లించకుండా ఉన్నవారిపై కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మొండి బకాయిల దుకాణాలను సీజ్ చేశామని, 64 ఇళ్లకు తాగునీటి కుళాయి కనెక్షన్లు కట్ చేశామని తెలిపారు. నగరాభివృద్ధికి పన్నులు ఎంతో కీలకమన్నారు. ఆస్తి పన్ను 58.41 శాతం, కుళాయి పన్ను 25.98 శాతం వసూలైందన్నారు. నగరవాసులు సత్వరమే పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునీద్ పాల్గొన్నారు.

అర్చకుడికి షోకాజ్ నోటీసు

మహానంది: మహానంది క్షేత్రంలోని వినాయకనంది ఆలయ ముఖ్య అర్చకుడు రాజారత్తయ్య బాబుకు దేవస్థానం షోకాజ్ నోటీసు జారీ చేసింది. 'సాక్షి'లో శనివారం 'ఆలయంలోనే అనధికార దుకాణం' శీర్షికన ప్రచురించిన వార్తకు అధికారులు నామ మాత్రంగా స్పందించారు. వివరణ కోరుతూ షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. అయితే అనధికారికంగా దుకాణం పెట్టి భక్తులను దోచుకుంటున్నట్లు నిర్ధారణ అయినప్పటికీ అధికారులు అర్చకుడిపై చర్యలకు వెనుకాడుతున్నట్లు సమాచారం.